క్లుప్తంగా

ఘనంగా నాగారమ్మ జాతర


విద్యుద్దీపాలంకరణలో నాగారమ్మ ఆలయం

నరసాపురం: పట్టణంలోని 31వ వార్డు చినమామిడిపల్లిలోని నాగారమ్మవారి జాతర బుధవారం ఘనంగా నిర్వహించారు. బుట్ట బొమ్మలు, ఆసాదుల నృత్యాలతో, బాణసంచా కాల్పులతో వైభవంగా జాతర నిర్వహించారు. జాతర సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారికి పూజలు చేశారు. గురువారంతో అమ్మవారి జాతర ఉత్సవాలు ముగియనున్నాయి.

గంగాలమ్మ ఆలయం వద్ద అన్నసమారాధన


ప్రత్యేక అలంకరణలో పూజలు అందుకుంటున్న గంగాలమ్మవారు

నరసాపురం రూరల్: మండలంలోని ఎల్బీచర్ల గంగాలమ్మవారి వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం అన్నసమారాధనను నిర్వహించారు. అమ్మవారికి భక్తులు నైవేద్యాలు సమర్పించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన అన్న సమారాధనలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. తోట నాగేశ్వరరావు వ్యవసాయ క్షేత్రంలో వెలసిన ఈ అమ్మవారి వార్షికోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీ నిర్వాహకులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వృద్ధులకు నూతన వస్త్రాలు అందజేత


పెదగరువు ప్రాథమిక పాఠశాలలో వృద్ధులకు దుస్తులు అందజేస్తున్న దృశ్యం

పాలకొల్లు అర్బన్: మండలంలోని పెదగరువు ప్రాథమిక పాఠశాల ఆవరణలో మంతెన అప్పారావు జ్ఞాపకార్థం గ్రామంలోని 65 మంది వృద్ధులకు బుధవారం నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. పాఠశాల హెచ్‌ఎం నిల్లా సురేష్ బాబు, మంతెన రాంపండు, గ్రామ పెద్దలు, పీఎంసీ సభ్యులు పాల్గొన్నారు.

ఎస్‌ఆర్‌కేఆర్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ శాంతికి పీహెచ్‌డీ


అసిస్టెంట్ ప్రొఫెసర్ శాంతిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

సాక్షి, భీమవరం: భీమవరం ఎస్‌ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న గొట్టుముక్కల శాంతికి ఆంధ్ర యూనివర్సిటీ అప్లైడ్ మ్యాథమెటిక్స్‌లో పీహెచ్‌డీ ప్రదానం చేసిందని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం జగపతిరాజు చెప్పారు. బుధవారం కళాశాలలో యాజమాన్యం తరపున శాంతిని కళాశాల ఉపాధ్యక్షుడు సాగి విఠల్‌రంగరాజు, జగపతి రాజును ఘనంగా సత్కరించిన సందర్భంగా జగపతిరాజు వివరాలను వివరించారు. ఆంధ్ర యూనివర్సిటీ రీసెర్చ్ డైరెక్టర్ డాక్టర్ టి లింగ రాజు, జాయింట్ రీసెర్చ్ డైరెక్టర్ డాక్టర్ సీయస్ బి రావు పర్యవేక్షణలో చేసిన పరిశోధనకు పీహెచ్‌డీ దక్కిందన్నారు. అనంతరం శాంతిని విఠల్‌రంగరాజు, జగపతిరాజు, డి వెంకటపతిరాజు తదితరులు అభినందించారు.

'శత గీత రసగుళికలు' పుస్తకావిష్కరణ


శత గీత రసగుళికల పుస్తకావిష్కరణ దృశ్యం

పాలకోడేరు : ప్రముఖ రచయిత మంతెన అచ్యుత రామరాజు రచించిన శత గీత రసగుళికలు పుస్తకావిష్కరణ మంగళవారం రాత్రి కోరుకొల్లులో నిర్వహించారు. భీమవరానికి చెందిన ప్రముఖ వైద్యుడు పీఆర్‌కె వర్మ ఈ పుస్తకాన్ని ఆవిష్కరించారు. తన తల్లిదండ్రులు మంతెన నర్సింహరాజు, లీలావతమ్మకు ఈ పుస్తకాన్ని రచయిత మంతెన అచ్యుతరామరాజు అంకితం చేశారు. వంద గీతాలు రచించిన రచయితను పలువురు అభినందించారు. వ్యాఖ్యాతగా సినీ ఆర్టిస్ట్ శ్రీనివాస్ వ్యవహరించగా, సర్పంచ్ మంతెన భారతి, రాష్ట్ర అటవీ శాఖ అభివృద్ధి డైరెక్టర్ మంతెన యోగీంద్ర కుమార్ (బాబు), ఉప సర్పంచ్ చంటిరాజు, పెన్మెత్స సీతారామరాజు, మాజీ సర్పంచ్ మంతెన లక్ష్మీ నర్సింహరాజు, నారాయణరాజు, మంతెన శ్రీనివాస్, సుందర్, పెన్మెత్స గీత, మ్యూజిక్ డైరెక్టర్ నరైన్ పాల్గొన్నారు.

వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి

- సీఎం జగన్ నాయకత్వంలో సంక్షేమ పాలన
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు
- పెనుమంట్రలో గడపగడపకు మన ప్రభుత్వం


పెనుమంట్రలో లబ్ధిదారులకు పథకాల వివరాలు తెలుపుతున్న ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు


పెనుమంట్రలో గోస్తనీ నదిపై రూ.8లక్షలతో నిర్మించిన వంతెనను ప్రారంభిస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు

పెనుమంట్ర: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పనితీరును చూసి ప్రజలు ఆశీర్వదించాలని మాజీ మంత్రి, ఆచంట ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు పెనుమంట్ర ప్రజలను కోరారు. బుధవారం పెనుమంట్రలో ప్రారంభమైన 115వ రోజు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. తొలుత రజక పేట నుంచి పర్యటన ప్రారంభించిన ఆయన ఇంటింటికీ వెళ్లి ఆ కుటుంబ క్షేమ సమాచారాలను తెలుసుకోవడమే కాకుండా సీఎం జగన్ ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలన్నీ సక్రమంగా అందుతున్నాయా అంటూ స్థానికులను ప్రశ్నించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇంకా ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని ఆయన గ్రామ ప్రజలను కోరారు. రాబోయే ఎన్నికల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించుకోవాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా రజకపేట, పల్లపువీధిలో ఆయన ప్రజలను కలిసి ప్రభుత్వ పథకాలను వివరించారు. పల్లపువీధిలో వైసీపీ నాయకుడు సత్తి వెంకట రామకృష్ణారెడ్డి (బంకు రాము) కుమార్తె కవలలకు జన్మనివ్వడంతో ఆమెను పరామర్శించిన శ్రీరంగనాథరాజు నవ జాత కవల శిశువులను ఆశీర్వదించారు. గోస్తనీ నదిలో కాలుష్యాన్ని అరికట్టి గోస్తనీ నదికి పూర్వ వైభవాన్ని తీసుకురావాలని గ్రామానికి చెందిన ప్రవాస భారతీయురాలు శ్రీరంగనాథరాజును కోరారు. తాము అధికారంలోకి వచ్చిన తరువాత ఇప్పటికే గోస్తనీ నదిలో కొంత మేర కాలుష్యాన్ని అరికట్టగలిగామన్నారు. త్వరలో గోస్తనీ పవిత్రతను పూర్తిస్థాయిలో కాపాడుతామన్నారు. అందుకు స్థానికులు కూడా సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కర్రి వెంకట నారాయణ రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు కర్రి గౌరీ సుభాషిణి, మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు ఈది అనిత, పెనుగొండ ఏఎంసీ చైర్‌పర్సన్ వెలగల వెంకట రమణ, సర్పంచ్ తాడిపర్తి ప్రియాంక, ఎంపీటీసీ సభ్యులు గండి రామారావు, చింతపల్లి మంగాదేవి, గ్రామ వైసీపీ అధ్యక్షుడు తేతలి సుధీర్‌రెడ్డి, ఉపసర్పంచ్ భూపతిరాజు శ్రీనివాసరాజు, సాయిరామరాజు, మండల కమిటీ అధ్యక్షుడు గూడూరి దేవేంద్రుడు తదితరులు పాల్గొన్నారు.

గోస్తనీ నదిపై నిర్మించిన వంతెన, స్నానాల రేవు ప్రారంభం

పెనుమంట్ర: పెనుమంట్ర రజకపేట వద్ద గోస్తనీ నదిపై రూ.8లక్షలతో పునర్నిర్మించిన వంతెనను పెనుమంట్ర పల్లపు వీధి వద్ద గోస్తనీనదిలో నిర్మించిన స్నానాల రేవును బుధవారం మాజీ మంత్రి, ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు, పెనుమంట్ర, అత్తిలి జెడ్పీటీసీలు కర్రి గౌరీ సుభాషిణి, అద్దాల జానకి ప్రారంభించి, శిలాఫలకాలను ఆవిష్కరించారు. గ్రామంలో బుధవారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు ఈ ప్రారంభోత్సవాలు చేశారు. పెనుమంట్ర నుంచి రజకపేటకు వెళ్లే రహదారిలో గోస్తనీ నదిపై బ్రిటీష్ కాలంలో నిర్మించిన వంతెన పదేళ్ల క్రితం కూలిపోయింది. అప్పటి నుంచి ఏ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రజకుల కోరిక మేరకు మండల పరిషత్ నిధులు రూ.8లక్షలు వ్యయం చేసి వంతెన నిర్మాణం చేపట్టారు. గోస్తనీ నదిలో పల్లపు వీధి వద్ద పవిత్ర స్నానాలు ఆచరించేందుకు గతంలో నిర్మించిన స్నానాల రేవు పూర్తిగా పాడైపోవడంతో గ్రామానికి చెందిన తేతలి వేణుగోపాలరెడ్డి తమ తల్లిదండ్రులు సుబ్రహ్మణ్యేశ్వరరెడ్డి, కమలావతి స్మారకార్థం రూ.75వేలతో స్నానాల రేవును పునర్నిర్మించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కర్రి వెంకట నారాయణరెడ్డి, సర్పంచ్ తాడిపర్తి ప్రియాంక, ఎంపీటీసీ సభ్యులు గండి రామారావు, చింతపల్లి మంగాదేవి, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సంక్షేమంతోపాటు అభివృద్ధికి ప్రాధాన్యత


యలమంచిలిలంకలో సీసీ రోడ్డు ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్మన్ కవురు శ్రీనివాస్

యలమంచిలి: రాష్ట్ర చరిత్రలో కనివినీ ఎరుగని రీతిలో సంక్షేమ పథకాలను అమలు చేస్తూనే అభివృద్ధి పథకాలకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని జెడ్పీ చైర్మన్, వైఎస్సార్ సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి కవురు శ్రీనివాస్ చెప్పారు. యలమంచిలిలంకలో జిల్లా పరిషత్ నిధులతో నిర్మించిన సీసీ రోడ్డును బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలంతా రాష్ట్రంలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలు గమనించి జగనన్నకు బాసటగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వల్లభు సాయి వెంకట నరసింహారావు, ఎంపీపీ రావూరి వెంకటరమణ వైఎస్సార్ సీపీ నాయకులు జగతాడి గంగరాజు, దంపనబోయిన వెంకటరత్నం, వినుకొండ రవి, గుర్రాల వెంకట్రావు, ఉచ్చుల స్టాలిన్, తోట రామకృష్ణ, గటిగంటి మహేష్, దివి నరసింహారావు, నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే గృహ సారథుల నియామకం


తూర్పుపాలెంలో మాజీ మంత్రి శ్రీరంగనాథరాజును సత్కరిస్తున్న ఆచంట వైఎస్సార్ సీపీ నాయకులు

పెనుగొండ: సచివాలయ పరిధిలో చేపట్టిన గృహ సారథుల నియామకంతో పార్టీ మరింత పటిష్టం కావడంతో పాటు, క్షేత్ర స్థాయిలో ఉన్న సమస్యలు పరిష్కారానికి మార్గం సుగమం అవుతుందని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. బుధవారం తూర్పుపాలెంలో కార్యాలయంలో ఎంపీపీలు, జెడ్పీటీసీలు, మండల కన్వీనర్లు, సచివాలయ మండల ఇన్‌చార్జిలతోనూ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వడలిలో రహదారి సమస్యలు పరిష్కరించాలని ఆ ప్రాంత మహిళలు కోరారు, ఆచంట అభివృద్ధికి సహకరిస్తున్నారని ఆచంట వైఎస్సార్ సీపీ నాయకులు మాజీ మంత్రి శ్రీరంగనాథరాజును సత్కరించారు. నియోజకవర్గంలో ఇప్పటికే సచివాలయ కన్వీనర్ల నియామకం పూర్తి కావడంతో, వారి పరిధిలో గృహసారథుల నియామకం పూర్తి చేయాలన్నారు. గడపగడపకూ మన ప్రభుత్వం పూర్తి అయిన సచివాలయ పరిధిలో సమస్యల పరిష్కారానికి ప్రణాళిక రూపొందిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే కొన్ని సచివాలయ పరిధిలో పనులు చేపట్టామన్నారు. గృహ సారథుల నియామకం పూర్తి చేసి మరో ముందడుగు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీలు పూతినీడి వెంకటేశ్వరరావు(పెద్ద), సుమంగళి, జెడ్పీటీసీలు పోడూరి గోవర్ధన, కర్రి గౌరీ సుభాషిణి, పార్టీ కన్వీనర్లు నల్లిమిల్లి వేణు ప్రతాపరెడ్డి(బాబీ), పిల్లి నాగన్న, జక్కంశెట్టి చంటి, సాకా సుబ్రహ్మణ్యం, వైస్ ఎంపీపీ పాలపర్తి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

నెలమూరులో వైభవంగా ముత్యాలమ్మ జాతర


నెలమూరులో ముత్యాలమ్మవారు


నెలమూరులో ముత్యాలమ్మ వారి ఆలయానికి విద్యుత్ దీపాలంకరణ

పెనుమంట్ర: నెలమూరు గ్రామ దేవత ముత్యాలమ్మవారి జాతర మహోత్సవాలు బుధవారం వైభవంగా నిర్వహించారు. ఉదయం ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి మహిళలు అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. సాయంత్రం మేళ, తాళాలు, బాణసంచా కాల్పులతో గ్రామోత్సవం నిర్వహించారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు గ్రామస్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కుచ్చర్లపాటి మంగతాయారు, ఎంపీటీసీ నాగరాజు లక్ష్మి, ఉపసర్పంచ్ కొయ్యే మోహనరావు, మాజీ సర్పంచ్‌లు ఎంవీ శేష నారాయణ, సాకా వెంకట్రావు, వైసీపీ నాయకులు నాగరాజు వెంకట్రామరాజు, కుచ్చర్లపాటి వెంకటపతిరాజు, ఆలయ కమిటీ సభ్యులు పాతపాటి శ్రీనివాసవర్మ, నాగరాజు రవివర్మ తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ చిత్రకారుడు ఉదయ్‌కు సత్కారం


చిత్రకారుడు ఉదయ్‌కుమార్‌ను సత్కరిస్తున్న తాతాజీ

పాలకొల్లు సెంట్రల్: అంతర్జాతీయ చిత్రకారుడు మార్లపూడి ఉదయ్‌కుమార్‌ని డీసీఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీ సత్కరించారు. అంతర్జాతీయ స్థాయిలో ఎన్నో చిత్రాలు గీసి ప్రశంసలు అందుకున్న చిత్రకారుడు ఉదయ్‌కుమార్ బుధవారం తాతాజీ చిత్రం గీసి అతని కార్యాలయానికి వెళ్లి అందజేశారు. ఈ సందర్భంగా తాతాజీ ఉదయ్‌ను శాలువాతో సత్కరించి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ పార్టీ నాయకులు రేలంగి శ్రీను, త్సవటపల్లి కృష్ణమోహన్, తలువూరి భుజంగరావు, పిల్లా శ్రీను, దిద్దే చిట్టిబాబు, చోడగిరి రమేష్‌బాబు, వజ్రపు కిరణ్ పాల్గొన్నారు.

వాలీబాల్ టోర్నమెంట్ విజేత పండిత విల్లూరు జట్టు


వడలి వాలీబాల్ టోర్నమెంట్ విజేతలకు బహుమతి ప్రదానం

పెనుగొండ: వడలిలో నిర్వహించిన ఫ్రెండ్స్ వాలీబాల్ టోర్నమెంట్ హోరాహోరీగా సాగగా పోడూరు మండలం పండిత విల్లూరు జట్టు విజేతగా నిలిచింది. ఫైనల్‌లో పండిత విల్లూరు, వడలి లగాన్ జట్లు పోటీపడగా పండిత విల్లూరు విజయం సాధించింది. పండిత విల్లూరు జట్టుకు రూ.8వేలు, కప్, మెడల్స్ అందించారు. ద్వితీయ స్థానంలో నిలిచిన వడలి లగాన్ టీమ్‌కు రూ.5వేలు, తృతీయ స్థానంలో నిలిచిన దేవ టీమ్‌కు రూ.3వేలు నగదు బహుమతిగా అందించారు. టోర్నమెంట్ విజయవంతం కావడానికి సహకరించిన క్రీడాకారులకు, గ్రామస్తులకు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలి


లోసరి గ్రామంలో క్రికెట్ టోర్నమెంట్ విజేతకు బహుమతి అందిస్తున్న దృశ్యం

భీమవరం అర్బన్: విద్యార్థులు విద్యతోపాటు క్రీడల్లోనూ రాణించాలని సర్పంచ్ జల్లా కొండయ్య అన్నారు. భీమవరం మండలంలోని లోసరి గ్రామంలో మూడు రోజుల పాటు నిర్వహించిన క్రికెట్ పోటీలు బుధవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా సర్పంచ్ జల్లా కొండయ్య మాట్లాడుతూ గ్రామస్థాయి నుంచి ఎంతోమంది క్రీడాకారులు తమ ప్రతిభను చాటి రాష్ట్ర, దేశ, అంతర్జాతీయ స్థాయిలో రాణించి పేరు ప్రఖ్యాతలు తీసుకువస్తున్నారన్నారు. క్రీడల్లో రాణించిన క్రీడాకారులకు ప్రభుత్వం స్పోర్ట్స్ కోటా ఉద్యోగాలు కల్పిస్తుందని విద్యార్థులు చిన్నతనం నుంచే క్రీడలపై మక్కువ పెంచుకోవాలన్నారు. ప్రతి రోజు ఒక గంట పాటు క్రీడలు ఆడటం వల్ల ఒత్తిడి దూరమై మానసిక ప్రశాంతత చేకూరుతుందన్నారు. మండల స్థాయిలో నిర్వహించిన ఈ క్రికెట్ టోర్నమెంట్‌లో 8 టీములు పాల్గొన్నాయి. తిరుమాని దుర్గరాజు కెప్టెన్‌గా ప్రాతినిథ్యం వహించిన టీం ప్రథమ బహుమతి రూ. 10 వేలు, షీల్డ్ గెలుపొందారు. కొల్లాటి సురేష్ కెప్టెన్‌గా ప్రాతినిథ్యం వహించిన టీం ద్వితీయ బహుమతిగా రూ. 5 వేలు, షీల్డ్ అందుకున్నారు.అందించారు. ఈ కార్యక్రమంలో ఒడుగు నారాయణమూర్తి, మోకా రాజు, జల్లా నారాయణమూర్తి, తిరుమాని కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలి


బీసీ సమావేశంలో మాట్లాడుతున్న ముద్దాడ గణేష్ భవానీ, మేకా శేషుబాబు

పాలకొల్లు సెంట్రల్: స్వాతంత్రం వచ్చి 75 సంవత్సరాలైనప్పటికీ బీసీలు అభివృద్ధికి దూరంగా ఉన్నారని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ముద్దాడ గణేష్ భవానీ అన్నారు. బుధవారం సాయంత్రం స్థానిక లయన్స్ కమ్యూనిటీ హాలులో జాతీయ బీసీల సంక్షేమ సంఘ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గణేష్ భవానీ మాట్లాడుతూ చేతి, కుల వృత్తులు చేసుకునే బడుగు బలహీన వర్గాల వారికి నేటికీ తగిన గుర్తింపు లేదని అన్నారు. రాష్ట్ర కన్వీనర్ దుర్గా నరేష్ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో బీసీలకు ఏ పార్టీ 90 ఎమ్మెల్యే సీట్లు కేటాయిస్తారో వారికే మద్దతు ఉంటుందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు నామినేటెడ్ పదవులకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించడంతోపాటు 139 బీసీ కులాలకు 56 కార్పొరేషన్లు ఏర్పాటు చేసి బీసీల పట్ల ఆయన కున్న ఔనత్యాన్ని చాటుకున్నారన్నారు. చట్టసభల్లోనూ రిజర్వేషన్లు కల్పించాలని అసెంబ్లీలో తీర్మానం చేసి రాజ్యసభ సభ్యులు విజయసాయిరెడ్డి ద్వారా పార్లమెంట్‌లో ప్రైవేటు బిల్లు పెట్టించినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. మాజీ ఎమ్మెల్సీ మేకా శేషుబాబు మాట్లాడుతూ 48 ఏళ్లుగా బీసీల కోసం అహర్నిశలు శ్రమించి మావంటి వారిని చట్ట సభలకు పంపించేందుకు కృషి చేసిన ఆర్ కృష్ణయ్య పోరాటం ఎనలేనిదన్నారు. ఆయన కృషిని గుర్తించిన సీఎం జగన్‌మోహన్ రెడ్డి రాజ్యసభకు కృష్ణయ్యను పంపించడం శుభపరిణామమన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వనమాల శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్షుడు కోడె యుగంధర్, పితాని చిన్నా, కడలి ధర్మారావు, కొండేటి శివ కుమార్ గౌడ్, మామిడి సత్యనారాయణ, తలువూరి బుజ్జి, వింజరపు శంకరం, శాగా రాంబాబు, బీరక ప్రసాద్ పాల్గొన్నారు.

డైరీ ఆవిష్కరణ

తాడేపల్లిగూడెం (టీటీసీ): రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల అసోసియేషన్ నూతన సంవత్సర డైరీని బుధవారం పెన్షనర్స్ కార్యాలయంలో సంఘ అధ్యక్షుడు బి.హరికుమార్ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ డైరీలో పెన్షనర్లకు సంబంధించి ఉపయోగపడే అనేక అంశాలను, ప్రభుత్వ జీవోలను పొందు పరిచినట్లు తెలిపారు. వైవీఎస్ మూర్తి, కె.బాలకృష్ణ, వీకే వీరారావు, ఎం.అర్జునరావు పాల్గొన్నారు.

యనమదుర్రులో అమ్మవార్ల జాతర

భీమవరం అర్బన్: భీమవరం మండలంలోని యనమదుర్రులోని మొగళ్లమ్మ, మహంకాళమ్మ అమ్మవార్ల జాతరను బుధవారం వైభవంగా నిర్వహించారు. సర్పంచ్ బూరబత్తుల రామ్మూర్తి, ఉప సర్పంచ్ తిరుమల విజయరామ్, కోఆప్షన్ సభ్యుడు బద్దా శాంతారామ్ పర్యవేక్షణలో అమ్మవార్ల గరగలను డప్పు వాయిద్యాలతో, మేళ తాళాలతో, బాణసంచాతో వైభవంగా ఊరేగించారు. భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లను ఉత్సవ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

భీమవరం అర్బన్: భీమవరం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో యువతి అదృశ్యంపై బుధవారం పోలీసులు కేసు నమోదు చేశారు. వారు తెలిపిన వివరాల ప్రకారం దెయ్యాలతిప్ప గ్రామానికి చెందిన కె.ఏడుకొండలు కుమార్తె ఈ నెల 13న ఇంటి నుంచి బయటకు వెళ్లి మళ్లీ తిరిగి రాలేదని స్నేహితులు, బంధువులు ఇళ్ల వద్ద ఆమె కోసం వెతికినా ఆచూకీ లభించక లేదని తండ్రి కొల్లాడి ఏడుకొండలు పోలీసులకు ఫిర్యాదు అందజేశారు. హెడ్ కానిస్టేబుల్ పి. ఉమామహేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ద్విచక్రవాహనం ఢీకొందని ఫిర్యాదు

సాక్షి, భీమవరం: భీమవరం వన్‌టౌన్‌లోని రైల్వే ఓవర్ బ్రిడ్జిపై నడిచి వెళ్తుండగా తనను గుర్తు తెలియని ద్విచక్రవాహనదారుడు ఢీకొట్టి వెళ్లిపోయాడని కె.వెంకట బాలాజి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈనెల 10న ఈ ఘటన జరగగా బుధవారం బాధితుడు ఫిర్యాదు చేశారని పోలీసులు తెలిపారు. ఎస్సై ఎస్.సత్య సాయి మాట్లాడుతూ ఈ ఘటనపై కేసు దర్యాప్తు చేస్తున్నారన్నారు.

పేకాట స్థావరంపై దాడి

ఉండి : ఉండి మండలం కోలమూరు ఆక్వా చెరువులపై నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై మంగళవారం అర్ధరాత్రి ఎస్సై కె.గంగాధరరావు ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో 15 మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.1.02 లక్షలు నగదును స్వాధీనం చేసుకుని, వారిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు చెప్పారు.

దాసాంజనేయ స్వామికి గంధ సింధూర పూజలు


ఆచంటలో దాసాంజనేయకి పూజలు చేస్తున్న భక్తులు

పెనుగొండ: ఆచంట కచేరీ సెంటర్‌లో దాసాంజనేయ స్వామి ఆలయం వద్ద త్రిరాత్రి మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బుధవారం భారీ అన్న సమారాధన నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు, కొలిశెట్టి వీర వెంకట తాతారావు దంపతులు, బండి సూర్యనారాయణ దంపతులు దాసాంజనేయ స్వామికి లక్షత మలపాకు, గంధ సింధూర పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తాళ్లూరి రామమోహన రావు, బుద్దరాజు విద్యాసాగర్, కొలిశెట్టి వీర వెంకట తాతారావు, నంబూరి అంజిబాబు, గుబ్బల బోస్ పాల్గొన్నారు.

విచక్షణారహితంగా ఎరువులు చల్లవద్దు


యలమంచిలిలో వరిచేలను పరిశీలిస్తున్న మండల వ్యవసాయాధికారి చిందులూరి దేవి

యలమంచిలి: వరి సాగులో రైతులు విచక్షణ రహితంగా ఎరువులు, పురుగు మందులు పిచికారీ చేయవద్దని మండల వ్యవసాయాధికారి చిందులూరి దేవి రైతులను కోరారు. యలమంచిలిలో బుధవారం ఆమె పర్యటించి వరి చేలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె రైతులతో మాట్లాడుతూ అవసరం మేరకే ఎరువులు వాడాలని చెప్పారు. రైతులు సేంద్రీయ వ్యవసాయానికి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. సేంద్రీయ వ్యవసాయ సాగు కారణంగా పెట్టుబడి తగ్గడమే కాకుండా నాణ్యమైన ఆహార ఉత్పత్తులు వస్తాయన్నారు. తద్వారా ప్రజల జీవన ప్రమాణం పెరుగుతుందన్నారు.

ఘనంగా పైళ్లమ్మ జాతర ప్రారంభం


పైళ్లమ్మ జాతరలో పాల్గొన్న సర్పంచ్ వెంకటసోమరాజు, గ్రామ పెద్దలు

ఉండి : ప్రసిద్ధిగాంచిన చిలుకూరు పైళ్లమ్మ అమ్మవారి జాతర ఉత్సవం బుధవారం ఘనంగా ప్రారంభమైంది. ఆలయ చైర్మన్, సర్పంచ్ ముదునూరి వెంకటసోమరాజు ఆధ్వర్యంలో రెండు రోజులపాటు ఈ జాతరను నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. బుట్టబొమ్మలు, కళారూపాలు, తీన్‌మార్, డప్పువాయిద్యాలు, గరగ నృత్యాలు, మందుగుండు కాల్పులతో జాతర సందడిగా సాగింది. గ్రామస్తులతోపాటు పరిసర గ్రామ ప్రాంత ప్రజలు ఈ జాతర మహోత్సవంలో ఉత్సాహంగా పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. జాతర ముగింపు సందర్భంగా గురువారం నిర్వహించనున్న అన్నసమారాధనకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని సర్పంచ్ కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు చేకూరి శ్రీనివాసరాజు (బోసురాజు), ఉండి ఏఎంసీ మాజీ చైర్మన్ మంతెన వెంకటనర్సింహరాజు, రుద్రరాజు బలరామరాజు, వేగేశ్న దిలీప్‌రాజు, పెన్మెత్స భీమరాజు, అల్లూరి వెంకట్రాజు(బుజ్జి), బుచ్చిరాజు శ్రీనురాజు, ఫణి పాల్గొన్నారు.

వైభవంగా మహంకాళమ్మ జాతర

తాడేపల్లిగూడెం (టీటీసీ): పట్టణంలోని కొబ్బరితోట శ్రీదేవి మహంకాళమ్మ తల్లి జాతర మహోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో బుధవారం రాత్రి మహంకాళమ్మ ఉత్సవాల వేదికపై అనేక ప్రదర్శనలు ఇచ్చి, అవార్డులు పొందిన అంబికా డ్యాన్స్ అకాడమి వారిచే కూచిపూడి జానపథం, రింగ్ ఫ్యూజన్ ప్రదర్శనలు జరిగాయి. పలు ప్రదర్శనలు ఆహుతులను అలరించాయి. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షుడు యెగ్గిన నాగబాబు పర్యవేక్షించారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
నరసాపురం డివిజన్
9010223729 (ఆచంట)
9010201609 (నరసాపురం)
9505507552 (పాలకొల్లు)
Office mail : tpgadvt@gmail.com